సాక్షి
పశ్చిమగోదావరి

శుక్రవారం | 14 | జూలై | 2023



డ్వాక్రా సొమ్ము స్వాహా

యూబీఐ బ్యాంక్ కరస్పాండెంట్ డ్వాక్రా గ్రూపు సభ్యులకు చెందిన దాదాపు రూ.60 లక్షలను స్వాహా చేయడంతో డ్వాక్రా మహిళలు లబోదిబోమంటున్నారు. IIలో ▸



వెలిపై విచారణ

నడిపూడి శివారు మిద్దేవారిపాలెంలో 12 కుటుంబాలను వెలివేసిన సంఘటనపై పశ్చిమగోదావరి జిల్లా ఎస్పీ రవిప్రకాష్ గురువారం విచారణ చేపట్టారు. IIలో ▸

16న బాస్కెట్‌బాల్ సెలెక్షన్స్

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సబ్ జూనియర్స్ బాలికల బాస్కెట్‌బాల్ జట్టును ఈనెల 16న ఏలూరులోని కస్తూరిబా బాలికల హైస్కూల్‌లో ఎంపిక చేయనున్నారు. IIలో



న్యూస్‌రీల్

సీఎం జగన్‌ను కలిసిన ఉద్యాన వర్సిటీ వీసీ



సీఎం జగన్‌కు మొక్క అందిస్తున్న వీసీ జానకీరామ్

తాడేపల్లిగూడెం: తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని గురువారం డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన వర్సిటీ వైస్ చాన్సలర్ తోలేటి జానకీరామ్ మర్యాదపూర్వకంగా కలిశారు. సీఎం సమీక్షా సమావేశానికి హాజరైన వీసీ జానకీరామ్ ఉద్యాన వర్సిటీ ప్రగతిని వివరించారు.

కార్తికేయునికి కావడి ఉత్సవం



పాలకావడి మోసుకువస్తున్న మంత్రి కారుమూరి

అత్తిలి: అత్తిలి వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి ఆలయం వద్ద ఆడి కావడి కృత్తికా మహోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. పౌరసరఫరాలశాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఉత్సవంలో పాల్గొని పాలకావడిని మోసుకుని స్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అత్తిలిలో తొలిసారిగా ఈ ఉత్సవాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు జరపాలని, స్వామివారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. దేవస్థానం తరఫున ఆయన్ను సత్కరించి, జ్ఞాపిక అందజేశారు. అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, దేవస్థానం చైర్మన్ కుర్రెళ్ల ఉమా మహేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, మాజీ ఏఎంసీ చైర్మన్ కూనపరెడ్డి జయరాజు తదితరులు పాల్గొన్నారు. ముందుగా భక్తుల దీక్ష విరమణ సందర్భంగా భారీ ఊరేగింపు జరిగింది.

నాబార్డు డీఎం పరిశీలన



ఆకివీడులో భవన నిర్మాణాలు పరిశీలిస్తున్న నాబార్డు డీఎం అనిల్‌కాంత్

ఆకివీడు: నాబార్డు నిధులతో స్థానిక సరోజినీ నాయుడు బాలికోన్నత పాఠశాలలో నిర్మిస్తున్న నూతన భవనాలను నాబార్డు డీఎం, రాష్ట్ర పరిశీలకుడు పి.అనిల్‌కాంత్ గురువారం పరిశీలించారు. అసంపూర్తి నిర్మాణంలో ఉన్న తరగతి గదులను పరిశీలించి పనులు పూర్తిచేసేందుకు నిధుల విడుదలకు నివేదిస్తామన్నారు. జిల్లాలో 15 హైస్కూళ్లలో అదనపు తరగతి గదుల నిర్మాణాలకు నిధులు విడుదల చేశామని, అయితే కొన్నిచోట్ల నిధులు సరిపోక పనులు నిలిచిపోయాయన్నారు. వీటన్నింటినీ పూర్తిచేసేలా కృషిచేస్తామన్నారు. సర్వశిక్ష అభియాన్ శ్యామ్‌సుందర్ మాట్లాడుతూ ఉండి నియోజకవర్గంలోని ఆకివీడు, ఉండి, కాళ్ల మండలాల్లో మూడు పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణాన్ని డీఎంతో పాటు పరిశీలించామన్నారు. ఎంఈఓ రవీంద్ర, హెచ్‌ఎం ఆర్.ఇందిర, సీఆర్‌పీ పరమేశ్వరి, డీఎల్ఎంటీ రమేష్ పాల్గొన్నారు.

ఆర్‌జీయూకేటీల్లో 161 మందికి సీట్లు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ)లో నిర్వహించే ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సు (ఇంటర్ నుంచి బీటెక్ వరకూ)లో ప్రవేశాలకు ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల నుంచి 161 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఏలూరు జిల్లా నుంచి నూజివీడు ట్రిపుల్ ఐటీకి 36 మంది, ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీకి ఒక విద్యార్థి, ట్రిపుల్ ఐటీ ఒంగోలు క్యాంపస్‌కు 42 మంది, శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌కు 23 మంది మొత్తం 102 మంది ఎంపికయ్యారు. పశ్చిమగోదావరి జిల్లా నుంచి నూజివీడు క్యాంపస్‌కు 18 మంది, ఇడుపులపాయ క్యాంపస్‌కు ఒకరు, ఒంగోలు క్యాంపస్‌కు 19 మంది, ఎచ్చెర్ల క్యాంపస్‌కు 21 మంది మొత్తం 59 మంది ఎంపికయ్యారు. కాగా నూజివీడు క్యాంపస్‌లో ఈనెల 20,21 తేదీల్లో, ఇడుపులపాయలో ఈనెల 21,22 తేదీల్లో, ఒంగోలు, ఎచ్చెర్లలో ఈనెల 24,25 తేదీల్లో కౌన్సెలింగ్‌కు హాజరు కావాల్సి ఉంటుందని ఆర్‌జీయూకేటీ ప్రవేశాల కన్వీనర్ తెలిపారు.

‘అదృశ్యం’లో అసలు నిజం

- 95 శాతానికి పైగా మిస్సింగ్ కేసుల ఛేదన
- ఏలూరు జిల్లాలో నాలుగేళ్లలో నమోదైన కేసులు 1,727
- ట్రేస్ చేసిన మొత్తం కేసులు 1,643
- పవన్ కళ్యాణ్ మాటల్లో డొల్లతనం
- మహిళలపై చిన్నచూపుతోనే ఇలాంటి వ్యాఖ్యలు



ఏలూరు టౌన్: రాష్ట్రంలో మహిళల రక్షణ, భద్రతకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోంది. అయితే రాష్ట్రంలో మహిళల అక్రమ రవాణా వ్యాపారం అత్యంత ప్రమాదకరంగా ఉందనే రీతిలో పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలు చేశారు. స్వచ్ఛంద సేవకులైన వలంటీర్లపై హేయమైన రీతిలో ఆరోపణలు చేయగా మిస్సింగ్ కేసులపై చర్చ జరుగుతోంది. అసలు అదృశ్యం కేసుల్లో అసలు నిజం తెలుసుకునేందుకు ఏలూరు జిల్లాలోని పోలీస్ రికార్డులను పరిశీలిస్తే పవన్ కళ్యాణ్ మాటల్లో డొల్లతనం బయటపడింది. జిల్లాలో అదృశ్యం కేసుల పరిష్కారంలో పోలీసులు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. 2019 నుంచి మిస్సింగ్ కేసులు, ఛేదించిన కేసుల సంఖ్య చూస్తే సాధారణ స్థాయిలోనే ఉండటం గమనార్హం. బాధ్యత రాహిత్యంగా అసంబద్ధ ప్రేలాపనలు చేస్తున్న పవన్ కళ్యాణ్‌పై మహిళల్లో వ్యతిరేక భావన కలుగుతోంది. అబద్ధపు ప్రసంగాలతో ప్రజలను తప్పుదోవ పట్టించడంతో మహిళాలోకం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోంది.

పోలీసు అధికారుల ప్రత్యేక పర్యవేక్షణ

ఏలూరు జిల్లాలో వాస్తవానికి మహిళలు, బాలికల మిస్సింగ్ కేసులకు, ఛేదించిన కేసులకు మధ్య వ్యత్యాసం భారీగా లేదు. వ్యక్తిగత కారణాలతో ఇంటి నుంచి బయటకు వెళుతున్న బాలికలు, యువతులు, మహిళలను ట్రేస్ చేసి పోలీసులు వెనక్కి తీసుకువస్తున్నారు. అలాగే నిరంతరం పోలీస్ ఉన్నతాధికారులు మిస్సింగ్ కేసులపై పర్యవేక్షణ చేస్తూ వాటి పరిష్కారానికి దర్యాప్తును వేగవంతం చేసేలా ఆదేశాలిస్తున్నారు. ఒకవైపు కుటుంబ సభ్యుల ఆందోళన, మరోవైపు పోలీసుల గాలింపు, దర్యాప్తుతో 95 శాతానికి పైగా మిస్సింగ్ కేసులు కొలిక్కి వస్తున్నాయి.

కేసుల వివరాలు పరిశీలిస్తే..

ఏలూరు జిల్లాలో 2019 నుంచి ఇప్పటివరకూ నమోదైన కేసుల వివరాలను పరిశీలిస్తే.. మహిళల అదృశ్యం కేసులు 1,311 నమోదు కాగా 1,231 కేసులు ట్రేస్ అయినట్లు జిల్లా పోలీస్ రికార్డులు చెబుతున్నాయి. 80 కేసులు దర్యాప్తు దశలో ఉన్నాయి. అలాగే బాలికల మిస్సింగ్ కేసులు పరిశీలిస్తే 416 కేసులు నమోదు కాగా 412 కేసులు ట్రేస్ అయ్యాయి. కేవలం నాలుగు కేసులు మాత్రమే దర్యాప్తు దశలో ఉన్నాయి. 2019, 2020, 2021, 2022లో బాలికల అదృశ్యం కేసులన్నీ పరిష్కారం కావడం విశేషం.

మహిళల మిస్సింగ్ కేసులు

సంవత్సరం	కేసులు	ట్రేసింగ్	అన్‌ట్రేస్డ్
2019	210	206	04
2020	265	258	07
2021	315	302	13
2022	346	326	20
2023 (ఇప్పటివరకు)	175	139	36
మొత్తం	1,311	1,231	80

బాలికల మిస్సింగ్ కేసులు

సంవత్సరం	కేసులు	ట్రేసింగ్	అన్‌ట్రేస్డ్
2019	58	58	0
2020	66	66	0
2021	112	112	0
2022	121	121	0
2023 (ఇప్పటివరకు)	59	55	4
మొత్తం	416	412	4

దశదిశలా రక్షణ



సీఎం జగన్ రాష్ట్రంలో మహిళలు, బాలికల భద్రతకు పెద్దపీట వేస్తున్నారు. ఇప్పటికే దిశ యాప్ ద్వారా ఏదైనా ప్రమాదమో, అత్యవసర పరిస్థితి ఎదురైతే వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకునేలా పటిష్ట చర్యలు చేపట్టారు. అత్యవసర పరిస్థితుల్లో మహిళలు, యువతులు, బాలికలు దిశ యాప్ ద్వారా రక్షణ పొందుతున్నారు. మహిళలకు పూర్తిస్థాయిలో రక్షణ కల్పిస్తున్నారు. మహిళలపై రాజకీయ నేపథ్యంలో విపరీత ధోరణిలో ఆరోపణలు చేయటం ఏమాత్రం సమర్థనీయం కాదు.

–షేక్ నూర్జహాన్, ఏలూరు నగర మేయర్

సత్వర న్యాయానికి చర్యలు



రాష్ట్రంలో మహిళలపై దాడులు, అఘాయిత్యాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకునేలా సీఎం జగన్ ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళుతోంది. సత్వర న్యాయం అందించేలా పోక్సో కోర్టులను సైతం ఏర్పాటుచేశారు. ఇటీవల కాలంలో పోక్సో కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా పోలీసు అధికారులు దర్యాప్తును వేగవంతంగా పూర్తి చేస్తూ బాధిత బాలికలు, మహిళలకు న్యాయం చేస్తున్నారు. మహిళలకు ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటోంది.

– పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్

ఆర్థిక పరిపుష్టికి ఊతమిస్తూ..



సమాజంలో మహిళలు ఆర్థికంగా పురోభివృద్ధి సాధించటంతోపాటు రాజకీయ, సామాజిక, ఆర్థిక అంశాల్లో ముందంజలో నిలిచేలా సీఎం జగన్ కృషిచేస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల మహిళలకు రాజకీయంగా అత్యధిక ప్రాధాన్యమిస్తున్నారు. మరోవైపు సంక్షేమ పథకాలను అందిస్తూ అండగా నిలుస్తున్నారు. మహిళల రక్షణకు పోలీస్ వ్యవస్థ నిరంతరం కృషి చేస్తోంది. రాజకీయాల కోసం మహిళల స్వేచ్ఛ, సమానత్వాలు దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేయటం సరికాదని రాజకీయ నేతలు గుర్తించాలి.

– మధ్యాహ్నపు ఈశ్వరి, ఇడా చైర్‌పర్సన్

జగనన్న సురక్ష ప్రజలకు వరం

డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ



లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న మంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం రాష్ట్ర ప్రజలకు వరం లాంటిదని ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. పట్టణంలోని 16, 17, 18 వార్డులకు నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో గురువారం పాల్గొన్న ఆయన లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందించారు. గతంలో ఏ ప్రభుత్వంలోను అమలుచేయని ప్రజాసంక్షేమ కార్యక్రమాలను సీఎం జగన్ అమలు చేస్తున్నారని అన్నారు. ఏళ్ల తరబడి పొందని సౌకర్యాలు, ధ్రువీకరణ పత్రాలు వంటి సదుపాయాలను కేవలం రోజుల వ్యవధిలోనే అందిస్తున్నారన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సదుపాయలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. మున్సిపల్ కమిషనర్ అనపర్తి సామ్యూల్, మున్సిపల్ ఇంజినీర్ మురళీకృష్ణ, కర్రి భాస్కరరావు, కొలుకులూరి ధర్మరాజు, బొడ్డు సాయిబాబా, గుండుబోగుల బలుసులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీఎస్‌ఎన్‌ఎల్ విజ్ఞప్తి

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిధిలోని బీఎస్‌ఎన్‌ఎల్ వినియోగదారులు 4జీ సేవల కోసం తమ సిమ్‌లను అప్‌గ్రేడ్ చేసుకోవాలని జిల్లా టెలికాం జనరల్ మేనేజర్ ఎల్.శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. బీఎస్‌ఎన్‌ఎల్ ఫ్రాంచైజీలు, ఓసీఎస్‌సీలు, సీఎస్‌సీలు, రిటైలర్లు, డీఎస్‌ఏల ద్వారా 4జీలోకి మారాలని కోరారు.

ముత్యాలమ్మ అనుగ్రహానికి పాత్రులు కండి

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



ముత్యాలమ్మవారికి సారె తీసుకువస్తున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ దంపతులు

తాడేపల్లిగూడెం రూరల్: ముత్యాలమ్మ వారి కృపకు ప్రజలు పాత్రులు కావాలని ఉప ముఖ్యమంత్రి, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. గురువారం మండలంలోని ముత్యాలంబపురం ముత్యాలమ్మవారికి దేవదాయశాఖ తరఫున గురువారం ఆషాఢ సారె సమర్పించారు. మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులకు ఆలయ అధికారులు మర్యాదలతో స్వాగతం పలికారు. శాకంబరి అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. మంత్రి కొట్టు దంపతులు అమ్మవారికి సారె సమర్పించి ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షిస్తూ అమ్మవారికి ఆషాఢ సారె సమర్పించామన్నారు. సీఎం జగన్‌కు అమ్మవారి ఆశీస్సులు కలగాలని కోరుకున్నామన్నారు. ఆషాఢ సారె సమర్పించడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ముందుగా కోలాట నృత్యాలు, కేరళ, కాంతార నృత్యాలు, ఆషాఢ సారెతో మంత్రి ఆలయానికి చేరుకున్నారు. అధిక సంఖ్యలో మహిళలు తరలివచ్చారు. దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ ఎం.విజయరాజు, ఆలయ కార్యనిర్వహణాధికారి పి.హరేరాంప్రసాద్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మాకా బాలాజీ, జూనియర్ అసిస్టెంట్ హరిబాబు, సొసైటీ చైర్మన్ పరిమి తులసీదాస్, రామన్నగూడెం సర్పంచ్ చింతా వెంకట్రావు, ఎంపీటీసీ నార్ని శంకరరావు, నాయకులు మాకా శ్రీనివాస్, గుండుబోగుల నాగు, వెల్నాటి సత్తిబాబు, రాజా త్రినాథ్, కారంకి వీర్రాజు, కర్రి భాస్కరరావు, ముప్పిడి సంపత్‌కుమార్, మానికొండ వెంకటేశ్వరరావు, ఈవోలు, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు వెలకట్టలేం

మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



కత్తవపాడులో జగనన్న సురక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి

ఇరగవరం: కరోనా సమయంలో వలంటీర్లు చేసిన సేవలు వెలకట్టలేనివని రాష్ట్ర పౌరసరఫరాల, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. గురువారం మండలంలోని కత్తవపాడు గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వలంటీర్లు అంటే బయట వారు కాదని, మీ ఇంటిలో బిడ్డలు, మీ ఊరి బిడ్డలన్నారు. అలాంటి వలంటీర్లు ఉమెన్ ట్రాఫికింగ్ చేసి మహిళలను అక్రమ రవాణా చేస్తున్నారని పవన్ కళ్యాణ్ అంటున్నాడని, అతనిది నోరా తాటిమట్టా అని మండిపడ్డారు. కరోనా సమయంలో కుటుంబసభ్యులే బయపడగా మేమున్నామంటూ వలంటీర్లు సేవలందించారని, అటువంటి సేవలపై ఇష్టానుసారంగా మాట్లాడేందుకు మనసు ఎలా వస్తుందని ప్రశ్నించారు. ఒక్క కత్తవపాడు గ్రామంలో టీడీపీ పాలనలో ఐదేళ్లకు రూ.2.51 కోట్ల లబ్ధి చేకూర్చగా వైఎస్సార్ సీపీ నాలుగున్నరేళ్ల పాలనలో రూ.11.76 కోట్లు అందించామన్నారు. పవన్‌కళ్యాణ్ ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారని, అయితే ప్రజలకు చెందాల్సిన సొమ్ములు దాచుకో.. దోచుకో.. పంచుకో రీతిలో గత టీడీపీ పాలన సాగిందన్నారు. సంక్షేమం, అభివృద్ధితో రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తున్న సీఎం జగన్‌ను మరోమారు గెలిపించాలని కోరారు. సురక్ష కార్యక్రమంలో 11 రకాల సేవలను ఇంటి వద్దకే ఉచితంగా అందిస్తున్నామన్నారు. వలంటీర్లు ఇంటింటా సేవలందిస్తున్నారన్నారు. అనంతరం లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందించారు. జిల్లా డ్వామా పీడీ ఎస్‌టీవీ రాజేశ్వరరావు, ఎంపీపీ కొప్పిశెట్టి అలివేలు మంగ తాయారు, డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, పార్టీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గాప్రసాద్,, వైఎస్సార్ సీపీ సేవాదళ్ అధ్యక్షుడు జవ్వాది ఏసుబాబు, మెరిపె నాగేశ్వరరావు, జగన్ మోహిని లక్ష్మి, పిల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా ఓటర్ల జాబితా సవరణ

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లావ్యాప్తంగా ఓటర్ల జాబితా సవరణలో చేర్పులు, మార్పులకు సంబంధించిన డేటా పూర్తిస్థాయిలో పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లాలోని ఓటర్ల జాబితా సవరణ చేర్పులు, తొలగింపులు నియోజకవర్గ ఎలెక్టోరల్ నమోదు అధికారులు, ఎలక్షన్ సిబ్బందితో ఓటరు నమోదు తదితర అంశాలపై ఆమె సమీక్షించారు. జిల్లాలో ఈ ఏడాది జనవరి నాటికి 14,42,469 మంది ఓటర్లు ఉన్నారని, ఫారం–6 ద్వారా 9,439 దరఖాస్తులు రాగా 3,725 పరిష్కారం చేసి నమోదు చేశామన్నారు. బూత్ స్థాయి అధికారులు ఈనెల 21 నుంచి ఆగస్టు 21 వరకు ఇంటింటా సర్వే చేపట్టి ఓటర్ల నమోదు, తొలగింపు చేపట్టాలన్నారు.

‘సురక్ష’లో మరిన్ని సేవలందించాలి

జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎక్కువ సర్వీసులు అందించేందుకు కృషిచేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో ఆమె సమీక్షించారు. అత్యధికంగా సర్వీస్ రిక్వెస్టులను తణుకు రూరల్ మండలంలో 12 వేలు, తాడేపల్లిగూడెంలో 10 వేలు, నరసాపురంలో 9,500, భీమవరం రూరల్‌లో 9,100 చేశారన్నారు. ఇదే స్ఫూర్తితో మిగిలిన మండలాల్లో ముందుకు సాగాలన్నారు.

ఎడతెగని వాన

- ఉమ్మడి జిల్లాలో 24 మి.మీ నగటు వర్షపాతం
- ఏజెన్సీలో పొంగిన కొండవాగులు
- మెట్టలో వ్యవసాయ పనులకు ఊతం



బుట్టాయగూడెం మండలంలోని ఇప్పలపాడు సమీపంలో జల్లేరు వాగు ఉధృతి



రెడ్డిగణపవరం సమీపంలో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు

ఏలూరు(మెట్రో)/బుట్టాయగూడెం: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రెండు రోజులుగా ఓ మోస్తరు వర్షం.. ఏజెన్సీ ప్రాంతంలో భారీ వర్షం కురుస్తోంది. ఈ వర్షం మెట్ట రైతులకు ఊరటనిచ్చింది. వ్యవసాయ పనులకు పూర్తి స్థాయిలో సన్నద్ధమవుతున్నారు. అలాగే డెల్టా ప్రాంతంలోని శివారు ప్రాంత రైతులకు వర్షం మేలు చేస్తోంది. వరి నారుమడులు పోసుకుని నాట్లు వేసేందుకు సిద్ధంగా ఉన్న రైతులకు ఉపయోగకరంగా మారింది.

జీలుగుమిల్లిలో అత్యధికం

పశ్చిమగోదావరి జిల్లాలో 7.88 మిల్లీమీటర్లు, ఏలూరు జిల్లాలో 12.2 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. ఏలూరు జిల్లాలోని 27 మండలాల్లో 23 మండలాల్లో బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు ఈ వర్షపాతం నమోదు కాగా, మండలాల వారీగా అత్యధికంగా జీలుగుమిల్లిలో 95.8 మి.మీ, బుట్టాయగూడెంలో 60.4 మి.మీ, కొయ్యలగూడెంలో 37.8 మి.మీ, పోలవరంలో 31.4 మి.మీ వర్షపాతం నమోదుకాగా, అత్యల్పంగా ఏలూరులో 0.2 మి.మీ, ఉంగుటూరులో 0.4 మి.మీ, నూజివీడులో 0.4 మి.మీ, పెదపాడులో 0.4 మి.మీ వర్షం కురిసింది. పశ్చిమగోదావరి జిల్లాలో అత్యధికంగా యలమంచిలిలో 18.6 మి.మీ, పాలకొల్లులో 17.6 మి.మీ, మొగల్తూరులో 16.4 మి.మీ, అత్యల్పంగా పెంటపాడులో 0.4 మి.మీ. పెనుమంట్రలో 1.8 మి.మీ, కాళ్లలో 2.2 మి.మీ వర్షపాతం నమోదైంది. మరో రెండు రోజుల పాటు చెదురుమదురు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖాధికారులు తెలిపారు.

జలాశయాల్లోకి భారీగా నీరు : దొరమామిడి సమీపంలోని గుబ్బల మంగమ్మ తల్లి జల్లేరు జలాశయంలోకి భారీగా వర్షం నీరు వచ్చి చేరింది. రిజర్వాయర్ పూర్తి సామర్థ్యం 217.80 మీటర్లు కాగా ప్రస్తుతం 210.05 మీటర్లు వరకు నీటిమట్టం చేరిందని అధికారులు తెలిపారు.

పోగొండ రిజర్వాయర్ : పోగొండ రిజర్వాయర్‌లో 155.7 మీటర్ల నీటిమట్టానికి వరద నీరు చేరింది. రిజర్వాయర్ పూర్తి సామర్థ్యం 156 మీటర్లు దాటి వరదనీరు ప్రవహించడంతో బైనేరు వాగు ఉధృతంగా ప్రవహించింది. దీంతో బైనేరు ఆనకట్ట గేట్లు తెరుచుకుని మరీ వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తోంది.

బుసలు కొడుతూ కోడె వాగు

కోడె వాగు బుసలు కొడుతూ ప్రవహించింది. అలాగే జీలుగుమిల్లి మండలం నుంచి కామయ్యపాలెం వెళ్లే రహదారిలో ఉన్న అశ్వారావుపేట వాగు ఉధృతంగా ప్రవహించింది. వాగు ప్రవాహంలో దాటుతున్న లారీ మధ్యలోనే నిలిచిపోయింది. ప్రవాహం ఉధృతి తగ్గిన తర్వాత లారీని బయటకు తీసుకువచ్చారు. గుబ్బల మంగమ్మతల్లి ఆలయ దర్శనానికి వెళ్తున్న భక్తులను ఆలయ కమిటీ ప్రతినిధులు కామవరం సమీపంలోనే నిలిపివేశారు. వాగుల ఉధృతి తగ్గిన తర్వాత భక్తులను మంగమ్మ తల్లి దర్శనానికి అనుమతి ఇచ్చారు.



బర్రింకలపాడు సమీపంలో వాగులో చిక్కుకున్న లారీ

ఉధృతంగా కొండవాగులు

ఏజెన్సీ ప్రాంతంలో వేకువజాము నుంచి కురుస్తున్న భారీ వర్షంతో కొండవాగులు పొంగిపొర్లాయి. బుట్టాయగూడెం మండలంలోని రెడ్డిగణపవరం సమీపంలోని జల్లేరు వాగు ఉధృతంగా, వీరన్నపాలెం సమీపంలోని కాలువ బుసలు కొడుతూ ప్రవహించాయి. ఇప్పలపాడు సమీపంలో జల్లేరు వాగు, కొవ్వాడ కాలువతో పాటు దాటు కాల్వ, పందిరి కాల్వ, చింతపల్లి కాల్వ, సింగర కాల్వ, చింతకొండ సమీపంలోని నల్లకాల్వ, గుబ్బల మంగమ్మ గుడి సమీపంలోని పలు కాల్వలు మధ్యాహ్నం ఒంటిగంట వరకూ పొంగిపొర్లాయి. దీంతో పలు ప్రాంతాల్లో వాహన రాకపోకలు నిలిచిపోయాయి.

నేటి నుంచి జాగృతి ఉద్యమం


భీమవరంలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న జీఐఓ రాష్ట్ర కార్యదర్శి, కుమారి ఫర్హాన తదితరులు

సాక్షి, భీమవరం: గరల్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ (జీఐఓ) రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో 'మార్పు - జీవితం అంతంకాక ముందే' అనే నినాదంతో రాష్ట్రవ్యాప్త ఉద్యమాన్ని చేపడుతున్నట్లు జీఐఓ రాష్ట్ర కార్యదర్శి, కుమారి ఫర్హాన చెప్పారు. గురువారం ఉద్యమ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో మాట్లాడారు. నేటి సమాజంలో పెరిగిపోతున్న అశ్లీలం, అనైతికత వల్ల యువత నైతికంగా దిగజారి చెడుల ప్రభావం వల్ల మహిళలకు రక్షణ కరువైందని ఆందోళన వ్యక్తం చేశారు. సమాజంలో మార్పు రావాలంటే ముందుగా ప్రతి ఒక్కరిలో నైతిక మార్పు అవసరమని భావించి ఈనెల 14 నుంచి 23వ తేదీ వరకు రాష్ట్ర స్థాయి జాగృతి ఉద్యమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. భీమవరం పట్టణ బాధ్యురాలు సుహాన మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో నైతిక మార్పు కోసం ఈ ఉద్యమంలో భాగంగా అనేక కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. జమాఅతె ఇస్లామి హింద్, మహిళా విభాగ పట్టణ అధ్యక్షురాలు సుల్తానా, జీఐఓ సభ్యులు ఫర్హాన, సోయెబా, తస్వీర్, సల్మా, సబీహా, తబస్సుమ్ పాల్గొన్నారు.

డ్వాక్రా సొమ్ము రూ.60 లక్షలు స్వాహా

- రుణ వాయిదాల సొమ్ము వాడేసుకున్న బ్యాంక్ కరస్పాండెంట్
- ఏ నెలకానెల రసీదులిచ్చినా ఖాతాలకు జమ చేయకుండా కాజేత
- నరసింగపాలెంలో లింకేజీ రుణం కోసం వెళ్లగా మోసం వెలుగులోకి..


ఆగిరిపల్లి మండలం నర్సింగపాలెంలో డ్వాక్రా గ్రూపుల సొమ్ము స్వాహాకు సంబంధించిన వివరాలు సేకరిస్తున్న సీసీ, బుక్ కీపర్లు

ఆగిరిపల్లి (నూజివీడు): ఆగిరిపల్లి మండలం నరసింగపాలెంకు చెందిన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ)కు చెందిన బ్యాంక్ కరస్పాండెంట్ డ్వాక్రా గ్రూపు సభ్యులకు చెందిన దాదాపు రూ.60 లక్షలను స్వాహా చేయడంతో డ్వాక్రా మహిళలు లబోదిబోమంటున్నారు. కూలీ నాలీ చేసుకుంటూ వచ్చిన సొమ్ములో కొంత దాచుకుని పొదుపు చేసుకుంటూ, తీసుకున్న రుణాలను చెల్లిస్తున్నారు. ప్రతి నెలా వాయిదా రుణం సొమ్మును డ్వాక్రా గ్రూపుల మహిళలు బ్యాంక్ కరస్పాండెంట్‌కు అందిస్తుండగా, అందుకు సంబంధించి రసీదులను ఇస్తూ అనుమానం రాకుండా ఆ సొమ్ములో మూడో వంతు సొమ్మును వారి బ్యాంక్ ఖాతాలకు జమ చేయకుండా సొంతానికి వినియోగించుకున్నాడు. గ్రామంలోని ఓ డ్వాక్రా గ్రూపు లింకేజీ రుణం ఇవ్వాలని కోరగా, అసలు విషయం వెలుగులోకి వచ్చింది.

కొన్ని గ్రూపుల ఖాతాలకు జమ కాని నయాపైసా సొమ్ము

గ్రామంలోని మదర్‌థెరిసా గ్రామ సమాఖ్య సంఘం పరిధిలో 42 గ్రూపులు యూబీఐ పరిధిలోను, ఒక గ్రూపు కో-ఆపరేటివ్ సొసైటీ బ్యాంకు పరిధిలో ఉన్నాయి. ఈ 42 గ్రూపుల మహిళలు తమ గ్రూపులకు సంబంధించిన స్త్రీనిధి రుణాలు, లింకేజీ రుణాలు, జగనన్న తోడు నగదు, ప్రతినెలా దాచుకునే పొదుపు సొమ్ములు అన్నీ కలిపి గ్రామంలో ఉన్న యూబీఐకు చెందిన బ్యాంక్ కరస్పాండెంట్ కె.అర్జునరావుకు తమ తమ ఖాతాలకు జమ చేయమని ఇచ్చి రసీదులు తీసుకుంటున్నారు. అయితే వారు చెల్లిస్తున్న మొత్తంలో కొంత తాను తీసుకుని మిగిలినది మాత్రమే వారి ఖాతాలకు జమ చేస్తూ వచ్చాడు. కొన్ని గ్రూపులకైతే అసలు జమ చేయలేదు. ఇలా 42 గ్రూపులలో 36 గ్రూపులకు సంబంధించిన సొమ్మును స్వాహా చేశాడు.

మోసం ఇలా వెలుగులోకి..

గ్రామంలోని ఒక డ్వాక్రా సంఘం లింకేజీ రుణం కోసం ఆగిరిపల్లిలోని బ్యాంకుకు వెళ్లగా ఆ సంఘానికి సంబంధించి అంతకు ముందు తీసుకున్న రుణం మొత్తం చెల్లించకుండా మళ్లీ లింకేజీ రుణం కోసం వచ్చారేమిటని బ్యాంకు అధికారులు ప్రశ్నించడంతో సంఘం సభ్యులు విస్తుపోయారు. అన్ని వాయిదాలు గ్రామంలోని బ్యాంక్ కరస్పాండెంట్‌కు చెల్లించామని చెప్పారు. దీంతో వారు అకౌంట్ స్టేట్‌మెంట్ తీసుకోగా పలు వాయిదాలు చెల్లించనట్లు ఉండటంతో తమ డబ్బులు దిగమింగినట్లు ఆ సంఘ సభ్యులు తెలుసుకున్నారు. ఈ విషయం గ్రామంలో ఇతర గ్రూపుల మహిళలకు తెలియడంతో అందరూ బ్యాంకు వద్దకు వెళ్లి స్టేట్‌మెంట్‌లు తీసుకోగా పెద్ద మొత్తంలో స్వాహా చేసిన విషయం వెలుగుచూసింది. విషయం తెలిసిన వైఎస్సార్ క్రాంతిపథం సీసీలు వచ్చి మొత్తం తనిఖీ చేయగా 36 గ్రూపులకు సంబంధించి దాదాపు రూ.60.41 లక్షలు స్వాహా చేసినట్లుగా తేల్చారు. ఏస్తేరు రాణి గ్రూపునకు సంబంధించి రూ.7.95 లక్షలు, ప్రగతి-1 గ్రూపునకు సంబంధించి రూ.5.60 లక్షలు, శ్రీసత్యసాయి గ్రూపునకు సంబంధించి రూ.4.76 లక్షలు, సిద్ధూ గ్రూపుకు సంబంధించి రూ.4.21 లక్షల చొప్పున పక్కదారి పట్టినట్లు నిర్ధారించారు. ఇలా అన్ని గ్రూపులకు సంబంధించి రూ.60 లక్షల మేర బ్యాంక్ కరస్పాండెంట్ అర్జునరావు దిగమింగినట్లు తేల్చారు.

ప్రతి నెలా రూ.20వేలు కాజేశాడు



తమ గ్రూపు తరుపున రూ.60 వేలు కడుతుంటే వాటిల్లో రూ.40 వేలు మాత్రమే జమచేసి రూ.20 వేలు స్వాహా చేశాడు. తమకు రసీదులు మాత్రం రూ.60 వేలకు ఇస్తున్నాడు. కష్టపడి సంపాదించి ఇచ్చిన సొమ్మును కాజేశాడు.

– లాము శేషకుమారి, ప్రియాంక గ్రూపు సభ్యురాలు, ఆగిరిపల్లి మండలం

ఏం చేయాలో పాలుపోవట్లేదు



2020లో రూ.10 లక్షల లింకేజీ రుణం తీసుకున్నాం. ఇందుకోసం ప్రతినెలా రూ.41 వేలు చొప్పున చెల్లిస్తున్నాం. ఈ సొమ్మును బ్యాంకుకు జమ చేయకుండా రూ.5.60 లక్షలను అర్జునరావు వాడేసుకున్నాడు. అందరం కూలీనాలీ చేసుకొని జీవించే వాళ్లమే. ఏం చేయాలో పాలుపోవడం లేదు. అధికారులు మాకు న్యాయం చేయాలి.

సాలి ప్రసన్న, ప్రగతి-1 గ్రూపు అధ్యక్షురాలు, నర్సింగపాలెం, ఆగిరిపల్లి మండలం

అధికారులు న్యాయం చేయాలి



మా గ్రూపు సభ్యులందరం రూ.10 లక్షలు లింకేజీ రుణం తీసుకుని ప్రతినెలా రూ.41 వేలు చెల్లిస్తున్నాం. రుణం సొమ్ము పూర్తిగా తిరిగి చెల్లించాం. అయినా ఇంకా రూ.7.95 లక్షలు బాకీ చెల్లించాల్సి ఉందని చెబుతున్నారు. ఈ సొమ్ము అంతా అర్జునరావు బ్యాంకుకు చెల్లించకుండా తినేశాడు. మాకు అధికారులు న్యాయం చేయాలి.

– తోట మరియమ్మ, ఏస్తేరు రాణి గ్రూపు సభ్యురాలు, నర్సింగపాలెం, ఆగిరిపల్లి మండలం.

అవకతవకలపై విచారణ చేస్తాం

నర్సింగపాలెంలోని యూబీఐ బ్యాంక్ కరస్పాండెంట్ డ్వాక్రా గ్రూపుల రుణాల నగదు చెల్లింపుల్లో అవకతవకలు పాల్పడినట్లు ఈనెల 12న మా దృష్టికి వచ్చింది. దీనిపై ఎంత మేరకు అవకతవకలు జరిగాయన్న విషయమై త్వరలోనే విచారణ నిర్వహిస్తాం.

– జగన్, యూబీఐ మేనేజర్, ఆగిరిపల్లి

మిద్దేవారిపాలెం వెలిపై విచారణ


మిద్దేవారిపాలెంలో విచారణ చేస్తున్న జిల్లా ఎస్పీ రవిప్రకాష్

పెనుగొండ: నడిపూడి శివారు మిద్దేవారిపాలెంలో 12 కుటుంబాలను వెలివేసిన సంఘటనపై జిల్లా ఎస్పీ యూ రవిప్రకాష్ గురువారం విచారణ నిర్వహించారు. చెరువు తవ్వకం, అంబేడ్కర్ విగ్రహానికి మెట్లు ఏర్పాటుపై ఇరువర్గాల మధ్య ఏర్పడిన వివాదంతో గ్రామానికి చెందిన 12 కుటుంబాలకు జీవనోపాధికి ఎటువంటి పనులు ఇవ్వకూడదని, వారికి చెందిన పొలాల దమ్ములకు వెళ్లకూడదని, పాలు, నిత్యావసర వస్తువుల అమ్మకాలు చేయకూడదని సంఘ పెద్దలు హుకుం జారీ చేశారని ఆరోపిస్తూ బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు 10 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. వెలి జరిగిందని గ్రామస్తులు పలువురు పోలీసుల విచారణలో బహిరంగంగా అంగీకరించడం గమనార్హం. ఎటువంటి పొరపాట్లు జరగకుండా చర్యలు తీసుకుంటామని కఠిన చర్యలు తీసుకోవద్దంటూ పోలీసులకు వారు విన్నవించుకున్నారు. విచారణలో సబ్ కలెక్టరు సూర్యతేజ, డీఎస్పీ రవిమనోహర్ చారి, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

25 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత


మొగల్తూరులో బియ్యం లారీని పట్టుకున్న రెవెన్యూ, పోలీస్ అధికారులు

మొగల్తూరు: తూర్పుగోదావరి జిల్లా కాకినాడకు లారీలో అక్రమంగా తరలిస్తున్న 25 టన్నుల రేషన్ బియ్యాన్ని గురువారం పోలీస్, రెవెన్యూ అధికారులు పట్టివేశారు. డిప్యూటీ తహసీల్దార్ నరేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కృష్ణా జిల్లా పామర్రు నుంచి తూర్పుగోదావరి జిల్లా కాకినాడకు బియ్యం తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు గురువారం ఉదయం మొగల్తూరు ఎస్సార్ పెట్రోల్ బంక్ సమీపంలోని జాతీయ రహదారి వద్ద పోలీస్, రెవెన్యూ అధికారులు వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఈ సమయంలో ఎటువంటి అనుమతులు లేకుండా 25 టన్నుల రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న లారీని గుర్తించారు. లారీని పోలీస్ స్టేషన్‌కు తరలించి సీజ్ చేశామన్నారు. లారీ డ్రైవర్ పసుపులేటి కృష్ణ ఇచ్చిన సమాచారం మేరకు ఉయ్యూరుకు చెందిన గొట్టపు రమేష్‌బాబుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.వీరబాబు చెప్పారు. దాడిలో ఆర్ఐ శిరీష, వీఆర్వో వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రూ.5.05 లక్షల విలువైన గోవా మద్యం స్వాధీనం

తాడేపల్లిగూడెం : గోవా నుంచి మినీ లారీలో అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని పెదతాడేపల్లి వద్ద స్వాధీనం చేసుకుని, ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు తాడేపల్లిగూడెం ఎస్ఈబీ సీఐ బి.సత్యనారాయణ గురువారం చెప్పారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రం అశ్వారావుపేటకు చెందిన సుంకర నాగరాజు, మల్లోజు సునీల్‌వర్మ, రాజనాల గంగాధర్ మినీ లారీలో గోవా నుంచి రూ.5.05 లక్షల విలువైన మద్యాన్ని మినీ లారీలో భీమవరానికి చెందిన వంకా ప్రవీణ్ అనే వ్యక్తికి అప్పగించేందుకు తరలిస్తున్నారన్నారు. గురువారం తమకు అందిన సమాచారం మేరకు ఎస్పీ యు.రవిప్రకాష్, ఏఎస్పీ రవికుమార్ ఆదేశాల మేరకు ఈ దాడి చేశామన్నారు. పెదతాడేపల్లిలోని మేకల సంత వద్ద మినీ లారీని అడ్డగించి అందులో ఉన్న మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను అదుపులోకి తీసుకోవడంతో పాటు, వంకా ప్రవీణ్‌పై కూడా కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు. దాడిలో ఎస్ఐ.కె.శ్రీనివాసబాబు, హెచ్‌సీలు పురుషోత్తమరావు, నరిసింహాచార్యులు, కానిస్టేబుల్ హబీబ్, సూర్యప్రకాశరావు పాల్గొన్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య


మృతి చెందిన వెంకటేశ్వరరావు

పెనుగొండ (ఆచంట): భార్య, ఆమె బంధువుల తీరుతో మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆచంట పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.కొడమంచిలి శివారు టి మెరకు చెందిన కుసుమే వెంకటేశ్వరరావు (42) భార్య జీవనోపాధి కోసం ఇటీవల గల్ఫ్ వెళ్లింది. అయితే గ్రామంలో ఉంటున్న పాస్టర్ కుసుమే కృష్ణ (సామ్యూల్ మారేష్)తో భార్య చాటింగ్ చేస్తుండడంతో వెంకటేశ్వరరావు తన తండ్రి ఆంజనేయులతో కలసి పాస్టర్‌పై సంఘంలో ఫిర్యాదు చేశాడు. సంఘ పెద్దలు పాస్టర్‌ను హెచ్చరించి, ఇటువంటి పనులు చేయకూడదని, గ్రామం విడిచి వెళ్లిపోవాలని హెచ్చరించారు. ఇదిలా ఉండగా భార్య బంధువులు, పాస్టర్‌కు ఇల్లు అద్దెకిచ్చిన వ్యక్తి కూడా వెంకటేశ్వరరావు ఇంటికి వెళ్లి కావాలనే అల్లరి చేస్తున్నావని అతనిని మందలించారు. దీంతో వెంకటేశ్వరరావు మనస్తాపానికి గురై బుధవారం పొలంలో పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న బంధువులు అతనిని ఆచంట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లగా,, మెరుగైన వైద్యం నిమిత్తం తణుకు తరలిస్తుండగా రాత్రి మృతి చెందాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కే రాజ్‌కుమార్ గురువారం చెప్పారు.

వలంటీర్లపై విషం కక్కడం ఆపండి

- వాస్తవాలు తెలుసుకో దత్తసన్ పవన్
- అప్సడా వైస్‌చైర్మన్ వడ్డి రఘురాం



తాడేపల్లిగూడెం: ప్రభుత్వం వివిధ వర్గాలకు సంక్షేమ పథకాల అమలులో విశేష సేవలను అందిస్తున్న వలంటీర్లపై విషం కక్కడం ఆపి వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని అప్సడా వైస్‌చైర్మన్ వడ్డి రఘురాం.. పవన్ కల్యాణ్‌కు హితవు పలికారు. గురువారం తాడేపల్లిగూడెంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. దళారుల ప్రమేయం లేకుండా, అవినీతికి తావులేకుండా వేకువజామునే మొదటితేదీనే పండుటాకులకు పింఛను పంపిణీ నుంచి, వారి ఆరోగ్య పరిస్థితులు, కష్టాలకు పరిష్కారం చూపించే విషయంలో వారధిగా వలంటీర్లు సేవలు అందిస్తున్నారన్నారు. ఇతర రాష్ట్రాలు కూడా ఈ వ్యవస్థ ఫలితాలు గుర్తించి, వలంటీర్, సచివాలయ వ్యవస్థలను ఆయా రాష్ట్రాలలో అమలు చేయడానికి ముందుకు వస్తున్నాయన్న విషయం మీకు తెలియదా పవన్ అన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో ప్రజలకు అన్ని రకాల పథకాలు, సేవలు అందడం ఇష్టంలేక, మీ దత్తత తండ్రి చంద్రబాబు చెప్పిన బాటలో వలంటీర్ వ్యవస్థపై విషం కక్కుతున్నారా అని ప్రశ్నించారు. వలంటీర్ల సేవల వల్ల ప్రజల మోములో ఆనందం కనపడుతుండటాన్ని భరించలేక అవగాహన రాహిత్యంతో, వ్యవస్థను కించపరిచేలా ఉన్నది లేనట్టుగా, లేనిది ఉన్నట్టుగా చెబుతూ విషం చిమ్మడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రజల వివరాలు హైదరాబాద్‌లోని నానక్‌రామ్‌గూడాలో ఉన్నాయన్న విషయం తెలంగాణ ఇంటిలిజెన్సు విభాగం తెలియజేసిందా ప్రశ్నించారు. గత టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీలు లబ్ధిదారుల వివరాలను తమ గుప్పెట్లో ఉంచుకున్నా ఆ పార్టీతో బంధంలో ఉన్న మీకు అప్పుడు తెలియలేదా, లేక తెలిసినా ఎందుకు ప్రశ్నించలేదన్నారు. సేవలందించే వ్యవస్థలను కించపర్చే విధానంతో మాట్లాడితే పవన్ ప్రజా ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందన్నారు. ప్రజావసరాలకు అనుగుణంగా సంక్షేమ పథకాల ఫలాలను పారదర్శకంగా అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను ప్రజలు గుండెల్లో పెట్టుకున్నారన్నారు. ఆ అభిమానం చెరపాలని చేసే మీవంటివారి ప్రయత్నాలు వ్యర్థాలే అని రఘురాం అన్నారు.

ఏకలవ్య పాఠశాలలో గెస్ట్ టీచర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

బుట్టాయగూడెం: మండలంలోని ఇప్పలపాడు సమీపంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో గెస్ట్ టీచర్‌గా పని చేసేందుకు ఆసక్తి, అర్హత గల రిటైర్డ్ టీచర్స్, ఇతర డిపార్ట్‌మెంట్‌లో పనిచేయుచున్న జేఎల్స్ (ఆన్ డిప్యుటేషన్) నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ బి.అమృత్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. టీజీటీ-2 హిందీ(పురుషులు-1, స్త్రీలు-1), పీజీటీ-4 (ఫిజిక్స్-1, మ్యాథ్స్-1, ఎకనామిక్స్-1, ఐటీ-1 పోస్టుల్లో పనిచేయుటకు దరఖాస్తులు కోరుతున్నామన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 15 నుంచి 21వ తేదీ వరకూ ఈమెయిల్ ద్వారా దరఖాస్తు చేయాలని సూచించారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

పెదపాడు: కారు ఢీకొని ఒక గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. కొక్కిరపాడు హైవే ఫ్లైఓవర్ వద్ద గురువారం గుర్తు తెలియని వ్యక్తి రోడ్డు దాటుతుండగా, అతివేగంగా వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి 25 నుంచి 30 ఏళ్ల లోపు వయస్సు ఉండవచ్చని పోలీసులు తెలిపారు.

గడపగడపకు సంక్షేమం


తాడేపల్లిగూడెం రూరల్ : ముత్యాలంబపురంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యానారాయణ

16న బాస్కెట్‌బాల్ బాలికల జిల్లా జట్ల ఎంపిక

ఏలూరు రూరల్: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సబ్ జూనియర్స్ బాలికల బాస్కెట్‌బాల్ జట్టు ఎంపిక పోటీలు ఈ నెల 16న చేపట్టనున్నామని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు కె కృష్ణారెడ్డి, కార్యదర్శి గవ్వ శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరు కస్తూరిబా బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో ఉదయం 9 గంటలకు ఎంపిక ప్రక్రియ ప్రారంభిస్తామని వెల్లడించారు. 01-01-2010 తర్వాత పుట్టిన వారే ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని వివరించారు. ఎంపికైన వారు ఈ నెల తూర్పుగోదావరి జిల్లాలో జరిగే అంతర జిల్లాల పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు పుట్టినతేదీ ధ్రువీకరణ పత్రం ఒరిజినల్, జిరాక్స్‌తో హాజరుకావాలని సూచించారు. మరింత సమాచారం కోసం 77804 84313 నంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించవచ్చన్నారు.

వలంటీర్లు కాదు.. వారియర్లు

- ముంగిటకే ప్రభుత్వ పథకాల అందజేత
- లబ్ధిదారుల మదిలో నిలిచిన వలంటీర్లు

తణుకు అర్బన్: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల ఇంటి ముంగిటకే అందించేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచింది. సేవే పరమావధిగా భావిస్తున్న వలంటీర్లు నామమాత్రపు గౌరవ వేతనంతో విధులు నిర్వర్తిస్తూ వెలకట్టలేని సేవలను ప్రజలకు అందిస్తున్నారు. అటువంటి వలంటీర్ వ్యవస్థను కించ పరుస్తూ జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై వలంటీర్లే కాదు, సామాన్య ప్రజలు కూడా భగ్గుమంటున్నారు. కరోనా సమయంలో వలంటీర్లు ప్రాణాలకు తెగించి, అందించిన సేవలకు వెలకట్టలేమంటున్నారు. దేశానికే ఆదర్శంగా ఉన్న వలంటీరు వ్యవస్థను విచ్ఛిన్నం చేయాలన్న దురుద్దేశంతో కొంతమంది కంకణం కట్టుకున్నారని లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంక్షేమ వారధులుగా వలంటీర్లు అందిస్తున్న సేవలపై సామాన్య ప్రజానీకం వెల్లడిస్తున్న అభిప్రాయాలివి...

బాగోగులు చూసుకుంటున్నాడు



నాపేరు నక్కా సత్యవతి. నేను తణుకు 28వ వార్డులో నివాసం ఉంటున్నాను. పదేళ్ల క్రితమే భర్త చనిపోగా దివ్యాంగుడైన కుమారుడితో కలిసి అద్దె ఇంట్లో నివాసముంటున్నాను. తల్లి, కుమారుడు ఇద్దరికి వస్తున్న పింఛన్లతోనే కాలక్షేపంచేస్తుండగా వలంటీరు యు.వంశీకృష్ణ అండగా నిలబడ్డాడని బాగోగులు చూసుకుంటున్నారు. ఏ దిక్కులేకపోగా ప్రభుత్వం అందిస్తున్న పింఛన్లకు తోడు వైఎస్సార్ చేయూత పథకంలో వస్తున్న డబ్బుతో కాలం గడుపుతున్నాను. వలంటీరు తమ సొంత బిడ్డలా మమ్మల్ని ఆదరిస్తున్నాడు.

– నక్కా సత్యవతి, తణుకు

కుటుంబ సభ్యురాలిలా...



తణుకు సజ్జాపురానికి చెందిన ఈమె పేరు ఆనందం సత్యవతి. ఈమెకు భర్తతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఒక బ్బాయి ఈ ఏడాదే ఇంజనీరింగ్ పూర్తికాగా మరొక అబ్బాయి ఇంజనీరింగ్ చదువుతున్నాడు. మా వలంటీరు బొబ్బిలి భవాని అందిస్తున్న ప్రోత్సాహం మరువలేనిది. ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు వివరించడంతో పాటు మా కుటుంబ సభ్యురాలివలె మాతో కలిసిపోయిందని చెబుతున్నారు.

– ఆనందం సత్యవతి, తణుకు

నిజాయతీగా సేవలు



తణుకుకు చెందిన ఈమె పేరు లాలం రుక్మిణి. చాలా ఏళ్ల క్రితమే భర్త చనిపోగా ఉన్న ఒక కొడుకు వేరొక ప్రాంతంలో నివసిస్తున్నారు. ఈమెకు పింఛన్‌తో పాటు కాపు నేస్తం పథకం ప్రభుత్వం నుంచి వస్తుంది. మా వలంటీరు బొబ్బిలి భవాని ప్రతి రోజు మా ఇంటికి వచ్చి బాగోగులు అడిగి తెలుసుకుంటుంది. సొంత బిడ్డ కూడా అంత బాగా చూడలేరోమో అనే విధంగా ఒంటరిగా ఉంటున్న నన్ను చూసుకుంటుంది.

– లాలం రుక్మిణి, తణుకు

చేదోడు.. వాదోడుగా



నాపేరు దోమ గౌరమ్మ. నేను వేల్పూరు, తణుకు రూరల్ మండలంలో నివసిస్తున్నాను. మా వలంటీర్ బత్రే మహేష్ నా కుమారులు, కుమార్తెల కన్నా ఎక్కువ సేవలు అందించారు. ఇంటికి పెద్ద కొడుకుగా అన్ని విషయాలల్లో చేదోడు వాదోడుగా వుంటున్నాడు. ముఖ్యంగా నేను కోవిడ్ 19 సమయంలో విజయవాడలోని ఓ కార్పొరేట్ ఆసుపత్రిలో థైరాయిడ్ చికిత్స చేయించుకోవడానికి అవసరమైన ఆరోగ్య శ్రీ పథకాన్ని వర్తింపచేసేలా చాలా కష్టపడి పని చేశాడు. ఆసుపత్రిలో చికిత్స చేయించుకుంటే సొంత ఖర్చులతో విజయవాడకు వచ్చి ఐసీయూలో ఉన్న నాకు పింఛన్ అందించాడు. ఇంట్లో ఏ సమస్య వచ్చినా వెంటనే స్పందించి సహాయం చేస్తున్నాడు. ఈమధ్య కాలంలో తన కాలుకు గాయమైనా ఇంటికి వచ్చిన పింఛన్ అందించాడు. వలంటీర్‌లు ఉన్నారు కాబట్టే మా ఇంటికి ఇన్ని సంక్షేమ పథకాలు అందుతున్నాయి.

– దోమ గౌరమ్మ, వేల్పూరు, తణుకు రూరల్ మండలం.

నేడు కోట సత్తెమ్మకు ఆషాఢం సారె సమర్పణ

తాడేపల్లిగూడెం రూరల్: నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం శ్రీకోట సత్తెమ్మ వారికి దేవాదాయ శాఖ తరపున శుక్రవారం 10 గంటలకు ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ఆషాఢ సారె సమర్పించనున్నట్టు ఉప ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయ ప్రతినిధులు తెలిపారు. సాయంత్రం 4 గంటలకు తాడేపల్లిగూడెం మండలం రామన్నగూడెం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు. ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పాల్గొనే ఈ కార్యక్రమానికి అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు హాజరు కావాలని కోరారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

పాలకోడేరు: పౌష్టికాహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని డీఎంహెచ్‌ఓ మహేశ్వరరావు అన్నారు. గురువారం పాలకోడేరు పీహెచ్‌సీతో ఎలిమెంటరీ పాఠశాలను, అంగన్‌వాడీలను ఆయన పరిశీలించారు. వసతులు, పరిసరాల పరిశుభ్రతపై ఆరా తీశారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని ఆహారం, తాగునీటి విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పీహెచ్‌సీ డాక్టర్ సీహెచ్ రంగం నాయుడు ఉన్నారు.

క్లుప్తంగా

పవన్‌కళ్యాణ్ కాన్వాయ్‌లో వైఎస్సార్‌సీపీ జెండాలు

- కంగుతిన్న జనసేన నాయకులు

తణుకు: జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ చేపట్టిన వారాహి యాత్ర గురువారం పశ్చిమ గోదావరి జిల్లా తణుకు చేరుకుంది. తాడేపల్లిగూడెం నుంచి బయల్దేరిన పవన్‌కళ్యాణ్ కాన్వాయ్ తణుకు మండలం తేతలి గ్రామానికి వస్తున్న సమయంలో వైఎస్సార్‌సీపీ జెండాలతో యువకులు హంగామా సృష్టించారు. ఒకవైపు పవన్‌కళ్యాణ్ కాన్వాయ్ సమీపిస్తుండటంతో ఒక్కసారిగా వైఎస్సార్‌సీపీ జెండాలు ప్రత్యక్షం కావడంతో జనసేన పార్టీ నాయకులు కంగుతిన్నారు. దీంతో ఉద్రిక్త వాతావరణ చోటుచేసుకుంది. ఈ సమయంలో పోలీసులు రంగప్రవేశంచేసి ఇరువర్గాలను చెదరగొట్టారు.

మాణిక్యాంబకు సారె సమర్పణ



భీమేశ్వరస్వామికి ఆషాఢ మాస సారె సమర్పిస్తున్న మహిళలు

ఆకివీడు: స్థానిక రాణా వీధిలోని మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో మాణిక్యాంబ అమ్మవారికి మహిళలు గురువారం ఆషాడ మాస సారెను సమర్పించుకున్నారు. ఉపేంద్ర భజన మండలి ఆధ్వర్యంలో ప్రదర్శనగా సారెను (ప్రత్యేకంగా తయారు చేసిన పిండి వంటలు, స్వీట్లు) ఆలయానికి తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించుకున్నారు. మహిళలు లలితా సహస్ర నామ పారాయణం, సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. భీమేశ్వరస్వామికి గోరింటాకులతో అభిషేకం చేశారు. మహిళలు కోలాట నృత్యం చేశారు. ఈ సందర్భంగా భజన మండలి అధ్యక్షురాలు కాకరపర్తి సుశీల మాట్లాడుతూ పట్టణంలోని అమ్మవార్లకు, మావుళ్లమ్మ, విజయవాడలోని కనక దుర్గమ్మలకు ఈ ఏడాది ఆషాడ మాస సారెలను సమర్పించామని చెప్పారు. ఆలయ కమిటీ ఇన్‌చార్జి గుర్రం హరినాథ్ మాట్లాడుతూ పురాతనమైన భీమేశ్వరస్వామి ఆలయంలో అనాదిగా వస్తోన్న పలు కార్యక్రమాల్ని కొనసాగిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో భజన మండలి ప్రతినిధులు ఓలేటి నాగలక్ష్మి, విజయ, గొంట్లా రాణి, పార్టీ నాయకులు నక్కాని పైడిరాజు, చొప్పెర్ల మణికంఠ, దేవేందర్ రెడ్డి, పేర్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

14న డీఎన్నార్‌లో మెగా ఉచిత వైద్య శిబిరం

సాక్షి, భీమవరం: భీమవరం డీఎన్నార్ కళాశాల లైబ్రరీ అవరణలో ఈనెల 14న మెగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్టు కళాశాల ఉపాధ్యక్షుడు గోకరాజు పాండురంగరాజు, సెక్రటరి, కరస్పాండెంట్ గాదిరాజు సత్యనారాయణరాజు గురువారం తెలిపారు. ఏలూరు ఆశ్రం హాస్పటల్స్ సహకారంతో నిర్వహించే ఈ శిబిరంలో కార్డియాలజీ, డెర్మటాలజీ, ఎండ్రోక్వీలాజీ, జనరల్ సర్జరి, జనరల్ మెడిసన్, కంటి సంబంధిత వ్యాధులు, కాటరాక్ట్ సర్జరీ, చెవి, ముక్కు, గొంతు , ఆర్థోపెటిక్, థైరాయిడ్ వంటి వైద్య సేవలు అందిస్తారని పేర్కొన్నారు. అవసరమైన వారికి మందులు అందజేయడం తోపాటు డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో అవసరమైన వారికీ జనరల్ సర్జరీలు చేస్తారని తెలిపారు. భీమవరం పరిసర ప్రాంతాల ప్రజలు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి



కుముదవల్లిలో మాట్లాడుతున్న అడిషనల్ డీఎంహెచ్ఓ భానునాయక్

పాలకోడేరు: అంటువ్యాధులు, జ్వరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని అడిషనల్ డీఎంహెచ్‌ఓ భానునాయక్ అన్నారు. కుముదువల్లి గ్రామంలో ఫ్యామిలీ ఫిజిషియన్ క్యాంపస్ గురువారం ఆయన పరిశీలించారు. వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామాల్లో వైద్య సిబ్బంది ఇంటింటికి తిరుగుతూ లెప్రసీ వ్యాధి రోగులను గుర్తించేలా సర్వే పూర్తి స్థాయిలో చేయాలన్నారు. టీబీ రోగులను గుర్తించడమే కాకుండా వారికి ప్రభుత్వం అందిస్తోన్న మందులను సక్రమంగా వాడించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ స్వర్ణ నిరంజని, సూపర్‌వైజర్లు అయ్యప్ప శ్రీనివాస్, నాగమణి, మహాలక్ష్మి, ఏఎన్ఎం హేమలత, ఆశ వర్కర్లు, పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో సంపూర్ణ ఆరోగ్యం

పెనుగొండ: ప్రకృతి వ్యవసాయంతో సంపూర్ణ ఆరోగ్యం పొందడంతో పాటు, పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చని ప్రకృతి వ్యవసాయ జిల్లా కో ఆర్డినేటర్ అరుణకుమారి అన్నారు. గురువారం జిల్లా ప్రకతి వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో ములపర్రులో రైతులకు, మహిళలకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఇళ్ల వద్ద కూరగాయలు, ఆకుకూరలు, తీగజాతి పంటలను పండించుకొని తినడం ద్వారా ఆరోగ్యాన్ని సంరక్షించుకోవచ్చునన్నారు.

జగన్ పథకాలపై ప్రజల్లో సంతృప్తి



తాడేపల్లిగూడెం మండలం ముత్యాలంబపురంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

- ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- పడాలలో గడపగడపకు మనప్రభుత్వం

తాడేపల్లిగూడెం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజల్లో పూర్తి సంతృప్తి కన్పిస్తోందని ఉప ముఖ్యమంత్రి కొట్టుసత్యనారాయణ అన్నారు. మండలంలోని పెదతాడేపల్లి పంచాయతీ పరిధి ముత్యాలంబపురం, పడాల గరువు ప్రాంతాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు చేకూరిన లబ్ధిని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ వివరించారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ పవన్ రాజకీయ పతనానికి చంద్రబాబు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటరీ, సచివాలయం వ్యవస్థలు దేశానికి ఆదర్శంగా ఉన్నాయన్నారు. వలంటరీ వ్యవస్థపై పచ్చి అబద్ధాలతో అభాండాలు మోపుతున్నారన్నారు. సేవాతత్పరతతో వలంటీర్లు పనిచేస్తున్నారని మంత్రి కొట్టు పేర్కొన్నారు. పడాల గ్రామాభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్‌వై.దుర్గాకిషోర్, ఎంపీడీవో ఎం.విశ్వనాథ్, ఈవోపీఆర్‌డీ ఎం.వెంకటేష్, ఏపీఎం జీవీకేడీఎం.లక్ష్మి, హౌసింగ్ ఏఈ వైవి.వెంకట్రావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ ఆర్.శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు టి.రవిచంద్ర, ఫణికుమార్, ఎమ్పీటీసీ మార్లపూడి సుబ్బారావు, నాయకులు ముప్పిడి సంపత్ కుమార్, కామిశెట్టి వినోద్, గారపాటి నానాజీ, విప్పర్తి ఆనందరావు, పులి ప్రసాద్, లింగంపల్లి వేమన, పులి గోపాలకృష్ణ, పులి భోగేశ్వరరావు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే జగనన్న లక్ష్యం

రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి



తణుకులో అధికారులు, పార్టీ నాయకుల సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: అన్ని వర్గాల సంక్షేమమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకులో మంత్రి క్యాంపు కార్యాలయంలో గురువారం ఇరగవరం మండలం రేలంగి గ్రామానికి సంబంధించి అధికారులు, పార్టీ నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ ప్రజావసరాలకు మొదటి ప్రాధాన్యతనివ్వాల్సిందిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎప్పటికప్పుడు చెబుతూనే ఉంటారని స్పష్టం చేశారు. అదే స్ఫూర్తితో రేలంగి గ్రామానికి అవసరమైన మౌలిక వసతులను కల్పించే క్రమంలో స్థానిక ప్రజల అభీష్టం మేరకు సౌకర్యాలు కల్పిస్తానని చెప్పారు. ఈ సందర్భంగా విద్యుత్ స్థంభాలు, విద్యుత్ ట్రాన్స్‌ఫారమ్స్, రహదారులు, డ్రెయినేజీలను అభివృద్ధి చేయాల్సిందిగా రేలంగి గ్రామ నాయకులు మంత్రి కారుమూరి దృష్టికి తీసుకురాగా తక్షణమే సంబంధిత పనులు పూర్తిచేయాలని కొన్ని గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో కూడా పెట్టి పూర్తి చేయాల్సిందిగా అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇరగవరం ఇన్‌ఛార్జ్ తహసీల్దారు బి.మాలతి, ఎంపీడీవో ఎ.శ్రీనివాస్, విద్యుత్ శాఖ డీఈఈ సీహెచ్ రామకృష్ణ, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు, డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, వైఎస్సార్‌సీపీ ఇరగవరం మండల అధ్యక్షులు కొప్పిశెట్టి దుర్గాప్రసాద్, రేలంగి గ్రామ సర్పంచ్ చేబ్రోలు స్వరాజ్యం, పార్టీ అధ్యక్షుడు పులుపు అనీల్, గౌరవ అధ్యక్షుడు వడ్డి మార్కండేయులు, వైఎస్సార్‌సీపీ ఇరగవరం మండల మహిళాధ్యక్షురాలు మెట్ల కిరణ్మయి, సొసైటీ అధ్యక్షుడు నడింపల్లి రాంబాబు, చేబ్రోలు పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు రెండు గ్రామాల్లో జగనన్న సురక్ష సభలు

పెంటపాడు: మండలంలోని ముదునూరు, కోరిమిల్లి గ్రామాల్లో శుక్రవారం గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ జీవీ శేషగిరిరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద ఉదయం 10గంటలనుంచి జరిగే సమావేశాలకు ప్రజలుపాల్గొని సమస్యలు తెలియజేయాలని కోరారు.

సుందరంగా తీర్చిదిద్దిన సోమేశ్వరస్వామి ఆలయం



సోమేశ్వరస్వామి ఆలయ ప్రాంతంలోని స్నానఘట్టాన్ని ప్రారంభించిన మంత్రి కారుమూరి, తదితరులు

తణుకు అర్బన్: సజ్జాపుర వాసుల ఇలవేలుపు సోమేశ్వరస్వామి వారి దేవాలయాన్ని సుందరంగా తీర్చిదిద్దడం అభినందనీయమని పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. సజ్జాపురం శివాలయం ప్రాంతంలోని గోస్తనీ కాలువలో నూతనంగా రూ. 17 లక్షల నిధులతో ఏర్పాటు చేసిన స్నాన ఘట్టాన్ని గురువారం మంత్రి కారుమూరి ప్రారంభించి మాట్లాడారు. నూతనంగా ఏర్పాటుచేసిన స్నానఘట్టం సుందరంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలోని ఆంజనేయస్వామి విగ్రహం, ద్వాదశ జ్యోతిర్లింగాల విభాగాలను మంత్రి కారుమూరి ప్రారంభించారు. ముందుగా మంత్రి కారుమూరికి దేవాదాయ ధర్మాదాయ శాఖ, ఆలయ ధర్మకర్తల మండలి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీవెంకటసుబ్బారావు, గౌతమి సాల్వెంట్స్ అధినేత మల్లిన రామచంద్రరావు, భద్రమ్మ దంపతులు, కోస్టల్ ఆగ్రో ఇండస్ట్రీస్ అధినేత చిలుకూరి రామకృష్ణ, సుజాత దంపతులు, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ అడ్డగర్ల శివబాబు, ఆలయ ఈవో ఎంవీ రామయ్య, వేంకటేశ్వరస్వామి ఆలయ ఈవో ముత్యాల సత్యనారాయణ, గుడిమెట్ల సూర్యనారాయణరెడ్డి, ధర్మకర్తల మండలి ట్రస్టీలు, భక్తులు పాల్గొన్నారు.

ఆదర్శపాలన అందించిన వీరుడు శాలివాహన చక్రవర్తి

తణుకు అర్బన్: భారతదేశంలో అన్ని కులాలను సమానత్వంగా పాలించి రాజ్యంలోని ప్రజలందరి మన్ననలు పొందిన వీరుడు శాలివాహన చక్రవర్తి అని పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు సొసైటీరోడ్డులోని వైఎస్సార్ పార్కులో నూతనంగా ఏర్పాటుచేసిన శాలివాహన చక్రవర్తి విగ్రహాన్ని మంత్రి కారుమూరి గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకోసం పోరాడి మంచి పరిపాలన అందించిన వీరుడి చరిత్ర భావి తరాలకు తెలియాలనే ఉద్దేశ్యంతో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ మాట్లాడుతూ రాజ్యంలో ప్రజలందరికీ ఆదర్శవంతమైన పాలన అందించి శాలివాహన శకంగా చరిత్రలో నిలిచిన మహనీయుడు శాలివాహన చక్రవర్తి అన్నారు.అనంతరం మంత్రి కారుమూరిని కుమ్మర సంఘీయులు ఘనంగా సత్కరించి మెమెంటో అందచేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కుమ్మర శాలివాహన డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మండేపూడి పురుషోత్తం, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కుమ్మర శాలివాహన సంఘం మాజీ అధ్యక్షులు కొలుకులూరి ధర్మరాజు, ఉమ్మడి జిల్లా కుమ్మర శాలివాహన వెల్ఫేర్ కమిటీ సభ్యులు బిరుదుకోట చింతన్న, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య తదితరులు పాల్గొన్నారు.



శాలివాహన చక్రవర్తి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి కారుమూరి, ఎమ్మెల్సీ రవీంద్రనాథ్ తదితరులు

జగన్ పథకాలు దేశానికే ఆదర్శం



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన యువనేత కారుమూరి సునీల్‌కుమార్

తణుకు అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని యువనేత కారుమూరి సునీల్‌కుమార్ అన్నారు. తణుకు 14వ వార్డు కొమ్మాయిచెర్వు గట్టు పల్లాలమ్మ నగర్ ప్రాంతంలో గురువారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జగనన్న అందిస్తున్న సంక్షేమ పాలనను ప్రజలంతా స్వాగతిస్తున్నారని స్పష్టం చేశారు. ప్రతి గడపలోను మరల జగనన్నే రావాలని ఆకాంక్షిస్తున్నారని అన్నారు. సంక్షేమ లబ్ధిని మహిళల బ్యాంకు ఖాతాలకే నేరుగా వేస్తూ మహిళల ఆదరణ పొందుతున్నారని అన్నారు. ముఖ్యంగా పేద విద్యార్థుల భవిష్యత్తుకు అమ్మ ఒడి, విద్యా కానుక, విద్యాదీవెన, వసతి దీవెన పథకాలు అందచేసి అండగా నిలిచారని అన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ డీఈఈ కొవ్వూరి ఈశ్వరరెడ్డి, ఏఈ రామకిషోర్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మెహర్ అన్సారీ, నత్తా కృష్ణవేణి, నాయకులు తిర్రే విజయకృష్ణ, కొఠారు రామాంజనేయులు, షేక్ బాజీ, సచివాలయ సెక్రటరీలు, వలంటీర్లుపాల్గొన్నారు.

సమస్యల సత్వర పరిష్కారానికే 'సురక్ష'

- మంత్రి కారుమూరి నాగేశ్వరరావు
- జోరుగా జగనన్న సురక్ష శిబిరాలు



దువ్వలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ధ్రువపత్రాలు అందజేస్తున్న మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు

తణుకు టౌన్: సమస్యలు సత్వర పరిష్కారానికే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు చేశారని పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖామంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. గురువారం తణుకు రూరల్ మండలం దువ్వ గ్రామంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో అయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో వలంటీరీ వ్యవస్థ ద్వారా కుల, పార్టీలకు అతీతంగా అర్హతే ఆధారంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని చెప్పారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజలకు జరుగుతున్న మేలు చూసి ప్రతిపక్ష పార్టీల నాయకులకు నిద్ర పట్టడంలేదని ఆరోపించారు. ఈ సందర్భంగా గ్రామ సచివాలయ పరిధిలో అర్హులైన వారికి ధ్రువ పత్రాలను అందజేశారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్, ఎంపీపీ రుద్ర ధనరాజు, సర్పంచ్ అడ్డా బాబు, మండల పార్టీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు, మండల సచివాలయాల కన్వీనర్ కరిబండి రాజేష్, వైస్ ఎంపీపీ ఐశెట్టి శేషకుమారి, సొసైటీ అధ్యక్షుడు పెనుమర్తి వెంకట్రామన్న, గ్రామ కమిటీ అధ్యక్షుడు సున్న దుర్గ ప్రసాద్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగం ఆనందకుమార్, గ్రామ కార్యదర్శి వీ గంగాధరరావు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. తణుకులోని 16వ వార్డు వెంకట్రాయపురం, 17వ వార్డులోని రామాలయం వద్ద జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ యూత్ నాయకుడు కారుమూరి సునీల్ కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని అర్హులైన వారికి ధ్రువ పత్రాలను అందజేశారు. ఈకార్యక్రమాల్లో ఆయా సచివాలయ పరిధిలోని సిబ్బంది, వలంటీర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలకు జగనన్న సురక్ష ఎంతో మేలు

అత్తిలి: ప్రజలకు పక్కాగా ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు అందించే లక్ష్యంతో నిర్వహిస్తున్న జగనన్న సురక్ష శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్ అన్నారు. గురువారం అత్తిలి-4, ఉనికిలి గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాలు జరిగాయి. ఈసందర్భంగా ఏఎంసీ చైర్మన్ భరణీ ప్రసాద్ మాట్లాడుతూ ప్రజలందరికీ నూరు శాతం ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సేవలు అందించడమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తుందన్నారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ పాలనలో నాయకులు సంక్షేమ పథకాల కోసం తమ ఇళ్ల చుట్టూ తిప్పించుకుని వారిని నానా ఇబ్బందులు పెట్టేవారని విమర్శించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఉనికిలి గ్రామంలో ఇళ్లపట్టాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మక్కా సూర్యనారాయణ, సర్పంచ్‌లు గంటా విజేత నాగరాజు, వట్టికూటి అనంతలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు రంభ సుజాత, ముదునూరి దుర్గా భవానీ, సొసైటీ అధ్యక్షుడు వట్టికూటి సూర్యనారాయణ, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెలగల అమ్మిరెడ్డి, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు పెన్మెత్స రామరాజు, ఉపసర్పంచ్ మద్దాల శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ నాయకులు రంభ సూరిబాబు, వట్టికూటి రాము, జక్కా సత్యవరప్రసాద్, మండా సత్యనారాయణమూర్తి, మండల ప్రత్యేక అధికారి మురళీకృష్ణ, తహసీల్దార్ ఏవీ రామాంజనేయులు, ఎంపీడీవో వీవీవీఎస్ రామారావు పాల్గొన్నారు.

ప్రజలకు సంపూర్ణ న్యాయమే ప్రభుత్వ ధ్యేయం

తాడేపల్లిగూడెం రూరల్: ప్రజలకు సంపూర్ణ న్యాయం చేయాలనేదే ప్రభుత్వ ధ్యేయమని తహసీల్దార్ వై.దుర్గాకిషోర్ అన్నారు. గురువారం మండలంలోని వీరంపాలెం, జగన్నాథపురం-1 సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహించారు. వీరంపాలెంలో తహసీల్దార్, జగన్నాథపురం-1 ఎంపీడీవో ఎం.విశ్వనాథ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమాల్లో సర్పంచ్‌లు కేతిరెడ్డి మాధవి, ఉంగ్రాజవరపు చంద్రిక, ఎమ్పీటీసీలు నార్ని శంకరరావు, పంచాయతీ ఈవో కె.శ్రీనివాసరెడ్డి, గోపీకృష్ణ పాల్గొన్నారు.



అత్తిలి మండలం ఉనికిలి గ్రామంలో లబ్ధిదారులకు ఇళ్లపట్టాలు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు



తాడేపల్లిగూడెం మండలం జగన్నాథపురంలో ధ్రువపత్రాలను అందజేస్తున్న దృశ్యం